జాడు చలావ్ యాత్రను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఆమ్‌ఆద్మీపార్టీ తెలంగాణశాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న జాడు చలావ్ యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం దోమలగూడలోని ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన పార్టీ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో రానున్న రోజుల్లో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, పురపాలక సంఘం కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పార్టీ సభ్యత్వ నమోదు, పాదయాత్రలు చేయాలని పార్టీ నేతలందరికీ ఆయన దిశానిర్దేశం చేశారు. సీనియర్ నాయకులు బుర్రా రాముగౌడ్, అన్సారీలు మాట్లాడుతూ నగరంలో శనివారం మధ్యాహ్నం మైలార్ దేవరపల్లిలో డాక్టర్ బేగ్ ఆధ్వర్యంలో పాదయాత్ర మొదలవుతుందని తెలిపారు. ఈ యాత్రల్లో ఆమ్‌ఆద్మీపార్టీ నేతలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రేపు బ్రాహ్మణ ప్రజాప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశం

రాంనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) :గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బ్రాహ్మణ ప్రజాప్రతినిధుల రాజకీయ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ తెలిపారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్‌కాలనీలోని రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువకులను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి బ్రాహ్మణ రాజకీయ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈసమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బ్రాహ్మణ సంఘాల నేతలు పాల్గొంటారని తెలిపారు. బ్రాహ్మణ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు అబిడ్స్‌లోని రాఘవ రత్నా టవర్స్‌లోని ఇండియా మైనింగ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న గోపాలకృష్ణ, రాధ, మురళీమోహన్‌రాజు

పుస్తకం హస్తభూషణం

చిక్కడపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తకం హస్తభూషణం లాంటిదని సినీ నిర్మాత, దర్శకుడు డా. నిట్టల గోపాలకృష్ణ అన్నారు. కుసుమ ధర్మన్న కళాపీఠం, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో రచయితలు చుంచు సంతోష్‌కుమార్ రచించిన ఆకాశంలో బ్రహ్మ.. భూలోకంలో అమ్మ, రాజ్యలక్ష్మి శశిధర్ రచించిన విజయ మల్లిక, నారి నరేష్ రచించిన నా ప్రయాణం, పడిగల దేవిదాస్ రచించిన ఆచార్య అక్షరమాల పుస్తకాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. పుస్తకాలను ఆవిష్కరించిన గోపాలకృష్ణ మాట్లాడుతూ పుస్తకాల వల్ల విషయ పరిజ్ఞానం కలుగుతుందన్నారు. కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధకుసుమ మాట్లాడుతూ కవులు సామాజిక హితం కోసం రచనలు చేస్తూ ఉంటారన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, ఆమంచ అంజయ్య, మహ్మద్‌షా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారు : అంజన్‌కుమార్


మురళీమోజేస్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రజలు కాంగ్రెస్ పాలనపై పూర్తి సంతృప్తితో ఉన్నారని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌నే బలపరుస్తున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు మురళీమోజేస్ ఆధ్వర్యంలో పలువురు నేతలు అంజన్‌కుమార్‌యాదవ్‌ను కలిసి పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూ సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేసే నేతలను అధిష్ఠానం గుర్తించి ఉన్నత పదవులను అప్పగిస్తుందన్నారు. ఈ సందర్భంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్న మురళీమోజేస్‌ను అంజన్‌కుమార్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, భవానీశంకర ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పి.సాయిబాబా తదితరులు

రెండేళ్ల పాలనలో చేసిందేమి లేదు : సాయిబాబా

రాంనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ రెండేళ్ల పాలనలో చేసిందేమి లేదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. గురుకుల విద్యాలయ స్థానిక సంక్షేమ హాస్టల్స్ దుస్థితి కాంగ్రెస్ పాలనకు అద్దం పడుతుందన్నారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల విద్యాలయాలు ప్రైవేట్ భవనాలలో కొనసాగుతున్నాయని, అయితే ఆ అద్దె చెల్లించడం లేదని, దీంతో ఆ భవనాల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాలయాల్లో నాణ్యతా ప్రమాణాలను పెంచడానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

17నుంచి 24వరకు రాష్ట్రవ్యాప్త ధర్నాలు : సాగర్


మాట్లాడుతున్న సాగర్ తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పత్తిరైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 17నుంచి 24 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ తెలిపారు. శుక్రవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పత్తిరైతుల ఆందోళనలో రాష్ట్ర రైతులు ఈనెల 26న జరిగే ప్రదర్శనలో, ధర్నాల్లో పాల్గొంటున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతి క్వింటాలుకు రూ.475 బోనస్ అమలు చేయాలన్నారు. పత్తి కొనుగోలు చేయడానికి కాటన్ కార్పొరేషన్ ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షులు ప్రసాదరావు, శివకుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ 1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. సాయిబాబా టెంపుల్, సీతు కాలనీ, ఆజామాబాద్, గుల్షన్‌నగర్, బాలాజి ఇంద్రప్రస్థ 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మౌలానాఆజాద్‌నగర్ పరిధిలో ఉదయం 10నుంచి 12గంటల వరకు, బంజారాఎవెన్యూ పరిధిలో ఉదయం 11నుంచి 12 గంటల వరకు, నెహ్రూనగర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి 1 గంటల వరకు, రామాలయం, స్పెన్సర్, ఎల్ఎన్‌నగర్, కవాడిగూడ, మహావీర్ ఓహెచ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు


బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ముషీరాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : నెహ్రూ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, పద్మావతి, కొండల్ రెడ్డి, రతన్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఈఎస్ ప్రభుత్వ పాఠశాలలో..

రాంనగర్: విద్యానగర్‌లోని ఎస్వీఈఎస్ ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు పాటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, కె.అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ది మదర్స్ హైస్కూల్‌లో..

రాంనగర్‌లోని ది మదర్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్ సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైమావతి ఉన్నత పాఠశాలలో..

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లోని హైమావతి ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆవుల నిరంజన్ విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు.

నవీన్‌యాదవ్ విజయంతో కాంగ్రెస్ నేతల సంబరాలు


చిన్నారులకు స్వీట్లు తినిపిస్తున్న కట్టెల సుభాష్, ఎస్.హరినాథ్‌రెడ్డి

నల్లకుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నవీన్‌యాదవ్ విజయంతో శుక్రవారం నల్లకుంట డివిజన్‌లో కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకుని ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ఈ విజయం ఫలితం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు మంత్రాలుగా పనిచేశాయని వారన్నారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారానికి ప్రజలు తగిన బుద్ధిచెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో కే.పీ.మురళీకృష్ణ, మురళీ, విజితారెడ్డి, శరత్, జి.మధుసూదన్‌రెడ్డి, కాలేరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బర్కత్‌పుర : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం సాధించడంతో బర్కత్‌పురలోని కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్, వెంకటేష్, బంటి, కిషోర్‌యాదవ్, రోహన్, దీపక్, భారతమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు సందర్భంగా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు సేన ఆధ్వర్యంలో సేన జాతీయ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం బర్కత్‌పురలో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్ పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు సేన నాయకులు శ్రీను పాల్గొన్నారు.

విజ్ఞాన ఆలయాలు గ్రంథాలయాలు


గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న పొట్లూరు పద్మజ

చిక్కడపల్లి, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన ఆలయాలని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం చిక్కడపల్లిలోని నగర కేంద్రగ్రంథాలయ సంస్థలో ఆమె లాంఛనంగా ప్రారంభించారు. సరస్వతీమాత, జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు పద్మశ్రీ డా. ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడుతూ లైబ్రరీల ద్వారా సమాజానికి ఎంతో విజ్ఞానం అందుతుందన్నారు. గ్రంథాలయాల వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఉద్యోగులు చంద్రకళ, సుబ్బలక్ష్మి, ప్రతిభారెడ్డి, అవినాష్‌రావు, వెంకటేశ్వరరెడ్డి, రామ్మోహన్, మహేందర్, అనిల్, రాజేష్, వివిధశాఖా గ్రంథాలయాల గ్రంథపాలకులు, పాఠకులు, పోటీపరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

శివ రీ రిలీజ్‌తో నాగార్జున అభిమానుల సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న నాగార్జున అభిమానులు

చిక్కడపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు నాగార్జున 35సంవత్సరాల కిందట హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం శివ మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రం శుక్రవారం ఉదయం బెనిఫిట్‌షోగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ప్రముఖ సినిమా థియేటర్ దేవి 70ఎంఎం థియేటర్‌లో రీ రిలీజ్ అయ్యింది. ఈ సందర్భంగా నాగార్జున అభిమానుల్లో అపారమైన ఆనందం నెలకొంది. ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అభిమానులు భారీ ఏర్పాట్లు చేశారు. థియేటర్ ఎదుట నాగార్జున కటౌట్ ఏర్పాటు చేసి బాణసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. రీ రిలీజ్ సందర్భంగా థియేటర్ పరిసరాలను పండుగ వాతావరణంగా మార్చేశారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన రామ్‌గోపాల్‌వర్మ, స్టూడెంట్‌గా నటించిన జేడి చక్రవర్తి, కాలేజీ క్యాంటీన్‌లో టీ సప్లయర్‌గా నటించిన ప్రముఖ నటుడు ఉత్తేజ్‌లు ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. థియేటర్ మేనేజింగ్ పార్ట్‌నర్ బాల్‌గోవింద్‌రాజ్, మేనేజర్లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్య


విశాల్‌గౌడ్ (ఫైల్)

కవాడిగూడ : భార్యభర్తల మధ్య నెలకొన్న గొడవతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోలక్‌పూర్ కృష్ణానగర్‌కు చెందిన ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుర్వి విశాల్‌గౌడ్(28), మల్లాపూర్‌లో నివాసం ఉండే నవ్య(25)తో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహం జరిగిన నాటినుంచి భార్యభర్తలకు మనస్పర్థలు వచ్చి గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దలు చెప్పినా వినక ఇటీవల ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో నవ్య తన భర్త విశాల్‌గౌడ్‌పై కేసు పెట్టింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న విశాల్‌గౌడ్ ఇంట్లోనే వర్క్‌ఫ్రంహోంలో విధులు నిర్వహిస్తున్నాడు. గొడవ జరిగిన నాటి నుంచి భార్య నవ్య పుట్టింట్లోనే ఉంటుంది. గురువారం సాయంత్రం విశాల్‌గౌడ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ రూంలో లోపలి నుంచి గడియపెట్టుకొని సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. అయితే తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బలవంతంగా తెరిచిచూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు వారు తెలిపారు. తమ కోడలు నవ్య, అత్తమామ, వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. శుక్రవారం గాంధీనగర్ పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


విద్యార్థులను స్వర్ణగిరి ఆలయ సందర్శనకు తరలించిన దృశ్యం

స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు

రాంనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రవేశపెట్టిన యాత్రాదానం కార్యక్రమంలో భాగంగా బాలల దినోత్సవం సందర్భంగా కేడీఆర్ ఛారిటబుల్ ట్రస్ట్(నాగర్‌కర్నూల్) కె.దక్షణమూర్తి జ్ఞాపకార్థం ముషీరాబాద్ డిపోకు యాత్రాదానానికి అవకాశం కల్పించారు. అందులో భాగంగా అమితాభ ఆదరణ విద్యాలయ విద్యార్థులను హైదరాబాద్ నుంచి స్వర్ణగిరి దేవాలయ సందర్శనకు శుక్రవారం తీసుకెళ్లారు. ఈ యాత్రాదానం అవకాశం కల్పించిన కేడీఆర్ చారిటబుల్ ట్రస్ట్ వారికి టీజీఎస్ ఆర్టీసీ తరఫున అమితాభ ఆదరణ విద్యాలయ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డిపో మేనేజర్ టి.రఘు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యపార్కులో గ్రీనరీని కాపాడాలి

- హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం

రాంనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కులో తవ్వకాలను ఆపివేసి గ్రీనరీని కాపాడాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాస్‌రావు, కె.వీరయ్య కోరారు. శుక్రవారం ఫోరం కార్యాలయంలో వారు మాట్లాడారు. ఇప్పటికే పార్కులో పిల్లల ఆట స్థలం, షటిల్ కోర్టు, ఓపెన్ జిమ్, ఆఫీసు భవనాలకు ప్రత్యేక స్థలాలు ఉన్నాయని వారన్నారు. అయితే పార్కు వద్ద లారీల పార్కింగ్‌తో పార్కు గ్రీనరీ పూర్తిగా దెబ్బతింటుందని అన్నారు. నగరంలో సుందరయ్యపార్కు ఆహ్లాదానికి కేర్‌ఆఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. ఈ తరుణంలో రోగాలబారిన పడకుండా ఉండడానికి సుందరయ్యపార్కు చక్కటి వాతావరణాన్ని కల్పిస్తూ వాకర్స్‌కు వాకింగ్ ట్రాక్, స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడానికి పచ్చని చెట్లు, జిమ్, పచ్చనిగడ్డితో ఉందన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే సుందరయ్యపార్కులో గ్రీనరీని కాపాడాలని, పిల్లల ఆట వస్తువులను ఆట స్థలంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నెహ్రూకు పాటల నీరాజనం

చిక్కడపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని త్యాగరాయగానసభలో శుక్రవారం రాత్రి సంధ్యాసరాగాల పల్లవి సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూకు గాన నీరాజనం అందించారు. భాగ్యశ్రీ ఆధ్వర్యంలో రమణారెడ్డి, ఇనాయత్‌అలీ, గంగరాజు, రామ్, గోపాల్, లక్ష్మి, నాగమణి తదితరులు మధురంగా దేశభక్తి గీతాలు ఆలపించారు. సభా కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజును సన్మానించారు. వీణా పాణిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



గానం చేస్తున్న గాయనీగాయకులు

ఆకట్టుకున్న పాటల విభావరి

చిక్కడపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మీనాక్షి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో పిల్లలు దేవుడు చల్లనివారే శీర్షికతో నిర్వహించిన పాటల విభావరి ఆకట్టుకుంది. మీనా బేబీ కేర్ సెంటర్ స్థాపక దినోత్సవం సందర్భంగా తనికెళ్ల మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన 12గంటల కార్యక్రమంలో భాగంగా చివరన సభా కార్యక్రమంలో ప్రముఖ గాయకులు చింతలపాటి సురేషను సత్కరించారు. మీనాక్షి స్వరమధురిమలు ప్రతినిధులతోపాటు గాయనీగాయకులు వినోద్‌బాబు, రామకృష్ణ, రాజేష్, సురేష్, సోమన్, శారదరెడ్డి, జ్యోతిర్మయి, లలిత, మనస్విని పాటలు ఆలపించారు. శ్రీనివాస్‌కుమార్, రాజేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవ ర్యాలీ

- సరైన ఆహారపు అలవాట్లు, శారీరకశ్రమతో మధుమేహాన్ని అరికట్టవచ్చు
- లయన్ డిస్ట్రిక్ 320 గవర్నర్ గంప నాగేశ్వర్‌రావు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ నేతలు

కవాడిగూడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం, వాకింగ్ వల్లనే మధుమేహ వ్యాధిని అరికట్టవచ్చని లయన్స్‌క్లబ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ డిస్ట్రిక్ 320 గవర్నర్ గంప నాగేశ్వర్‌రావు, అధ్యక్షుడు లయన్ చంద్రమోహన్ సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలో సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి కవాడిగూడ తాళ్లబస్తీ, ఎస్‌బీఐకాలనీ, సింగాడికుంట, ముగ్గుబస్తీ, ఎస్‌బీహెచ్‌కాలనీ తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఆహారపు అలవాట్లు, శారీరకశ్రమ లేకపోవడంతో చాలామంది మధుమేహం బారిన పడుతున్నారని అన్నారు. మధుమేహంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించినట్లు వారు తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ అవగాహన ర్యాలీలో లయన్ విజయేందర్, కమలాకర్, హేమంత్, శేరుపల్లి గణేష్ పద్మశాలీ, రమేష్, నాగరాజు, చందన, శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతో సంపూర్ణ ఆరోగ్యం : డా. సూర్యప్రకాష్

ముషీరాబాద్: జీవనశైలి మార్పులతో సంపూర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సీనియర్ కార్డియాలజిస్ట్, గురునానక్ కేర్ ఆస్పత్రి రీజినల్ క్లీనికల్ డైరెక్టర్, డాక్టర్ జి. సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో డయాబెటిక్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది, ప్లకార్డులను ప్రదర్శిస్తూ మధుమేహంపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ జి. సూర్యప్రకాష్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కె.ఎస్ మోహినొద్దీన్, డాక్టర్ ఇమ్రాన్ మాట్లాడారు. మధుమేహాన్ని ముందుగా గుర్తించడంతోపాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవడంతోపాటు వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. చాలా మందిలో ముందస్తు లక్షణాలు లేకుండానే మధుమేహం లక్షణాలు బయటపడుతాయని పేర్కొన్నారు. సమస్యలను అధిగమించేందుకు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం అవసరం అన్నారు. ప్రతిరోజు వ్యాయామం, సమతుల ఆహారం, కంటినిండా నిద్ర, ఒత్తిడి లేకుండా ఉంటే మధుమేహం బారి నుంచి రక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ అధికారి భరత్ జెట్టి, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో మధుమేహంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కేర్ ఆస్పత్రి డాక్టర్లు సూర్యప్రకాష్, మోహినొద్దీన్ తదితరులు

చిక్కడపల్లి: మధుమేహ సంబంధిత సమస్యలను నివారించడానికి లయన్స్‌క్లబ్ విశేషంగా కృషి చేస్తుందని లయన్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో, డయాబెటిస్ చైర్మన్ డా. జీకే రమణ తెలిపారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా శుక్రవారం చిక్కడపల్లిలోని శ్రీసాయి డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించి రిపోర్టులు, మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని, ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడటానికి ముందస్తుగా గుర్తించడం సకాలంలో చికిత్స, సమాచారం స్వీయసంరక్షణ ప్రాముఖ్యతను లయన్స్‌ఇంటర్నేషనల్ హైలైట్ చేస్తుందన్నారు.